ఎస్సీమోర్చా బీజేపీ సెల్ కన్వీనర్‌గా నరేందర్



నియామక ఉత్తర్వులు అందుకుంటున్న మంచర్ల నరేందర్

శంషాబాద్: బీజేపీ ఎస్సీమోర్చా సెల్ కన్వీనర్‌గా పోశెట్టిగూడెం గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు మంచర్ల నరేందర్ నియమించారు. ఈ మేరకు ఎస్సీమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటీ శ్రీధర్ నియామక ఉత్తర్వులు అందజేశారు. తన పదవికి సహకరించిన ఎస్సీమోర్చా అధ్యక్షుడితో పాటు ఎస్సీమోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి కుమార్, బీజేపీ రాష్ట్ర నాయకులు బోసుపల్లి ప్రతాప్, జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర నాయకులు డాక్టర్ ప్రేమ్‌రాజ్, రాజ్‌భూపాల్ గౌడ్, తదితరులు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

తడి, పొడి చెత్తను వేరు చేసి అందించాలి



అవగాహన కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: 'స్వచ్ఛతా హీ సేవా' 2024 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం స్లమ్ జేఎస్ఎన్ఆర్‌యూఎంలోని ప్రజలకు చెత్తను వేరు చేసి అందించడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర హాజరైయ్యారు. 19వ డివిజన్ మైకెల్ కాలనీలో పార్క్ క్లీనింగ్ పనులను చేయించారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త సేకరణ కార్మికులకు అందించాలన్నారు. అలాగే ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ యాదయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, ఎన్విరాల్‌మెంటల్ ఇంజనీర్ శ్రావణ బిల్ కలెక్టర్ నయీమ్, శానిటరీ జవాన్లు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోండి

మణికొండ: నిబంధనలకు విరుద్ధంగా అధనంగా అంతస్తులు పెంచి ఎలాంటి సెట్ బ్యాక్‌లు పాటించకుండా చేపడుతున్న నిర్మాణాలపై మున్సిపాలిటీ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీలో ఓ నిర్మాణ సంస్థ జీ ప్లస్ 5 అంతస్తులకు అనుమతులు తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ నిర్మించటంతో పాటు అధనంగా మరో 2 అంతస్తుల నిర్మాణం చేపట్టారని బీజేపీ సీనియర్ నాయకుడు శివకుమార్ కాలనీ వాసులతో కలిసి మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. సదరు భవనంపై వెంటనే చర్యలు తీసుకోవాలని, మున్సిపల్ అధికారులు స్పందించకపోతే జిల్లా కలెక్టర్, హైడ్రా కమిషనర్లకు ఫిర్యాదులు చేస్తామని హెచ్చరించారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీ, మండల పరిధిలోని మొత్తం 103 మంది లబ్ధిదారులకు శుక్రవారం కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. పట్టణంలోని బేగంగార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ చేతుల మీదుగా రెవిన్యూ అధికారులు పంపిణీ చేశారు. మొత్తం 1,03,11948 రూపాయలను అందజేశారు. లబ్ధిదారులకు చేయూతనందించేందుకు ప్రభుత్వం కల్యాణ లక్ష్మిని అందజేస్తోందని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్ దత్తు, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ బండిగోపాల్, మాజీ జెడ్పిటీసీ తన్వీ, కౌన్సిలర్లు కుమార్, అజయ్, మేకల వెంకటేష్, సంజయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగా రక్తదాన శిబిరం

గోల్కొండ: ఈ నెల 22న మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న సేవా పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరం ఆదివారం గుడిమల్కాపూర్‌లోని రాజలింగయ్య కబడ్డీ స్టేడియంలో ఉదయం 10 గంటలకు ప్రారంభవుతుందని ఆయన అన్నారు. బీజేపీ అన్ని విభాగాల నాయకులు, కార్యకర్తలతో పాటు స్థానిక యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని ఆయన కోరారు.

'మనూ'లో విద్యార్థుల ఆందోళన

రాయదుర్గం: హాస్టళ్లలో నాణ్యమైన ఆహారం అందించాలని మనూలో విద్యార్థులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. పరిపాలనా భవనం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. మెస్‌లలో నాణ్యమైన ఆహారాన్ని అందించాలని తల్హామన్సన్ డిమాండ్ చేశారు. తాము ఎన్నిసార్లు ఆందోళన చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు.

విద్యార్థి సంఘం ఎన్నికల వాయిదాపై ఆగ్రహం..

విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో విద్యార్థి సంఘం ఎన్నికలను అధికారులు రద్దు చేశారు.దీనిపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించి నిర్వహించాలని కోరారు. ఇదిలావుండగా విద్యార్థుల నిరసన నేపథ్యంలో పోలీసులు ప్రధాన గేటు వద్ద బందోబస్తు ఏర్పాటు చేసి బయటి వారు లోపలికి వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు.

కేటీఆర్‌ను కలిసిన మాజీ కార్పొరేటర్

రాయదుర్గం: మాజీ మంత్రి కేటీరామారావును గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా శుక్రవారం నందినగర్‌లోని ఆయన నివాసంలో కలిశారు. సాయిబాబా, కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ రంగారావు తదితరులు ఉన్నారు. శేరిలింగంపల్లిలో బీఆర్‌ఎస్ పార్టీని పటిష్టం చేయాలని కేటీఆర్ ఈ సందర్భంగా వారికి సూచించారు.

నేడు బీఆర్‌ఎస్ ముఖ్య నాయకుల సమావేశం

రాయదుర్గం: బీఆర్‌ఎస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ముఖ్య నాయకుల సమావేశం శనివారం జరుగుతుందని, ఆ పార్టీ నాయకుడు మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా తెలిపారు. ఖాజాగూడలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు.

దేవాదాయ శాఖ భూమిలో రోడ్డు

- ప్రైవేటు వెంచర్‌కు దారి
- అడ్డుకోవాల్సిన అధికారులే అండ
- అక్కడే ఉండి పనులు చేయించిన వైనం
- నిలదీసిన గ్రామస్థులు



దేవాదాయ శాఖ భూమిలో నుంచి రోడ్డు వేస్తున్న రియల్టర్లు

మణికొండ: గండిపేట మండలం మంచిరేవుల రెవెన్యూ పరిధిలో శ్రీ వేణుగోపాల స్వామి ఆలయానికి 100 ఎకరాల భూమి ఉంది. అందులో సర్వేనెంబర్ 293లో 13.13 ఎకరాల భూమి ఉంది. అది ఔటర్ సర్వీసు రోడ్డుకు పక్కనే ఉంది. ఎకరం రూ. 50 కోట్లకు పైగానే పలికే అవకాశం ఉంటుంది. దాన్ని అనాధిగా గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి కుటుంబం సాగు చేయటం, దానిపై హక్కులు కల్పించాలని రాష్ట్ర హైకోర్టును గతంలోనే ఆశ్రయించటంతో యధాతథ స్థితిలోనే ఉంచాలని స్టే ఇచ్చింది. దేవాదాయ శాఖ ట్రిబ్యునల్‌లో ఎండోమెంట్ కమిషనర్ ఆ భూమిని స్వాధీనం చేసుకునేందుకు అధికారం ఇవ్వాలని వేసిన కేసు పెండింగ్‌లోనే ఉంది.

పక్కన వెంచర్‌కు దారి..

సదరు దేవాదాయ శాఖతో వివాదంలో ఉన్న భూమి పక్కనే ఓ ప్రైవేట్ వెంచర్ వారు నిర్మాణ పనులను మొదలు పెడుతున్నారు. వారు సర్వేనెంబర్ 293లో నుంచి రోడ్డు వేసుకునే పనులను గురువారం మొదలు పెట్టారు. దీంతో విషయం తెలుసుకుని సంజీవరెడ్డి కుటుంబ సభ్యులు, ఆలయ పూజారులు, గ్రామస్థులు అక్కడికి వెళ్లి పనులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ వారు వినిపించుకోకుండా పనులను కొనసాగించారు. అంతలో అక్కడికి చేరుకున్న దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ శేఖర్ తన తోటి అధికారులతో వచ్చి పనులను ఆపించకపోగా, వారిని పనులు చేసుకునేందుకు ప్రోత్సహించారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చేసేదేమి లేక గ్రామస్థులు నార్సింగి పోలీసులను ఆశ్రయిస్తే రికార్డుల ప్రకారం సదరు భూమి దేవాదాయ శాఖదిగా ఉందని, సదరు అధికారులు వచ్చి ఫిర్యాదు చేస్తే తీసుకుంటామన్నారని గ్రామస్థులు పేర్కొన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి వెంటనే చర్యలు తీసుకుని సదరు భూమిని పరిరక్షించాలని మంచిరేవుల గ్రామస్థులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించండి



గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రుల నిరసన

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల/పాఠశాలల్లో డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గౌలిదొడ్డిలోని బాలికల కళాశాల/పాఠశాల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం, పేరెంట్స్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం 'టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్–సీఓఈ గురుకులాల భద్రత–తల్లిదండ్రుల బాధ్యత' అనే నినాదంతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తల్లిదండ్రులు మాట్లాడుతూ గురుకులాలల్లో ఇప్పటి వరకు కొనసాగిన కాంట్రాక్టు ఉపాధ్యాయులను కొనసాగించడంతోపాటు నెలవారీగా వారికి వేతనాలు అందించాలని, నాన్‌టీచింగ్ ఉద్యోగులకు వేతనాలు సక్రమంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు పద్ధతిలో 8 ఏళ్లుగా కొనసాగుతున్న సబ్జెక్ట్ అసోసియేట్స్‌ను తొలగించడం న్యాయం కాదన్నారు. వారి స్థానంలో కొత్తగా వచ్చిన వారికి అనుభవం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల ప్రాంగణంలో నిరసన తెలపాలని తల్లిదండ్రులు ప్రయత్నించగా పోలీసులు వారిని వారించి ప్రిన్సిపాల్‌తో మాట్లాడి, వినతిపత్రం అందించి వెళ్లేలా ఒప్పించారు. అనంతరం తల్లిదండ్రులు డిమాండ్లతో కూడి వినతిపత్రాన్ని ప్రిన్సిపాల్ కల్పనకు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మణికొండ: విద్యుత్ వైర్లకు సమీపంలోని చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున శనివారం మణికొండ సబ్‌స్టేషన్ పరిధిలో పలు ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏఈ జ్ఞానేశ్వర్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 11.30 గంటల వరకు పంచవటి కాలనీ, ట్రయల్స్ విల్లాల పరిధిలో, ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 22 నుంచి 30 వరకు, డాలర్స్‌హిల్స్, తిరుమలహిల్స్, బయాత్ కాలనీ, పీజీ కాలేజ్ కాలనీ, అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 1,2ల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. మధ్యాహ్నం 2.30గంటల నుంచి మైహోం అవతార్, మధ్యాహ్నం 1.30 నుంచి 2గంటల వరకు జన చైతన్య కాలనీ, పంచవటీ కాలనీలో సరఫరా నిలిపివేస్తున్నామని అన్నారు. మరోవైపు మైలార్‌దేవ్‌పల్లి కాటేదాన్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎసిస్టెంట్ ఇంజనీర్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 12.30గంటల వరకు లక్ష్మీగూడ విలేజ్, హౌసింగ్ బోర్డ్ కాలనీ, ఆర్‌జీకే, వాంబేకాలనీ, బృందావన్ కాలనీ, గణేష్ నగర్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

రేపు 'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగుతుంది. ఇందులో 'బీయింగ్ అసెర్టివ్' అనే అంశంపై అమెరికాకు చెందిన బిహేవియర్ థెరపిస్ట్ బికే హర్ష ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. అనంతరం 'స్పిరిచ్యువల్ సిగ్నిఫికెన్స్ ఆఫ్ శ్రద్ధ్ (పితృపక్ష)' అనే అంశం పై కూడా ప్రసంగం ఉంటుంది. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

ఎస్కీలో 'ఏక్ పేడ్ మా కే నామ్'

రాయదుర్గం: పర్యావరణ పరిరక్షణకు చెట్లు ఎంతో అవసరమని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం ఎస్కీ ప్రాంగణంలో 'ఏక్ పేడ్ మా కే నామ్' పేరిట మొక్కలు నాటారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమెజాన్ అడవుల్లోని చెట్లు ప్రపంచంలోని 20 శాతం మందికి ఆక్సిజన్ అందిస్తున్నాయన్నారు. అందుకే అమెజాన్ అడవులను లంగ్స్ ఆఫ్ ది ఎర్త్ అంటారని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చీఫ్ లక్ష్మీకాంతరావు, సివిల్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్ విభాగం హెడ్ డాక్టర్ ఆదినారాయణరావు, అధికారులు కెజే అమరనాథ్, డాక్టర్ కృష్ణప్రసాదరావు, అనితఅగర్వాల్, విద్యాసాగర్, రాజశేఖర్‌రెడ్డి, ప్రశాంత్, నరేష్, శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా మౌలిక వసతుల కల్పన




గోపన్‌పల్లిలో సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: ప్రతి కాలనీ, బస్తీల్లో దశలవారీగా మౌలిక వసతులు కల్పిస్తామని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లిలో రూ.50 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం స్థానికులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా మార్చే ప్రక్రియ కొనసాగుతోంద ని, పలు చోట్ల డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసిన తర్వాత సీసీరోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. అనంతరం స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వర్క్‌ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, సీనియర్ నాయకులు శేఖర్, సురేష్, రంగ స్వామి, మురుగ, రాజు చంద్రమౌళి, ప్రసా ద్, శ్రీనివాస్, స్థానికులు పాల్గొన్నారు.

ఆధునిక సాహిత్యానికి ఆద్యుడు గురజాడ

రాయదుర్గం: నవయుగ వైతాళికులు, ఆధునిక సాహిత్యానికి ఆద్యుడు గురజాడ వెంకట అప్పారావు అని హెచ్‌సీయూ తెలుగుశాఖాధ్యక్షుడు ఆచార్య పిల్లల మర్రి రాములు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ తెలుగుశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గురజాడ అప్పారావు జయంత్యోత్సవంను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్యాశుల్కం నాటకంలోని ప్రధానమైన సామాజిక దృక్పథం, తాను చూసిన సామాజిక సమస్యలను నాటకంగా రచించారని గుర్తు చేశారు. తెలుగు విభాగం పూర్వ అధ్యక్షుడు దార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గురజాడ కథా సాహిత్యం, కవిత్వం గురించి విశ్లేషించారు. ఆచార్యులు పమ్మి పవన్‌కుమార్, గోనానాయక్, డి విజయలక్ష్మీ, పి వారిజారాణి, త్రివేణి, భూక్యాతిరుపతి, భుజంగారెడ్డి, విజయ్‌కుమార్, భాశెట్టి లత, విజయకుమారి, పరిశోధక విద్యార్థులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

గోల్కొండ ఆసుపత్రి పనితీరు అమోఘం



గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది పనితీరు అమోఘం అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ డాక్టర్ జె.అజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన గోల్కొండ ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఔట్ పేషంట్ విభాగాన్ని పరిశీలించి అక్కడ జరుగుతున్న ఓపీ రిజిస్ట్రేషన్ ప్రక్రియలను పరిశీలించారు. అనంతరం ఆయన మెయిల్, ఫీమెల్ ఇంజక్షన్ విభాగంతో పాటు ఓపీ డాక్టర్ల గదులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన ఆసుపత్రిలో జరుగుతున్న కాన్పుల వివరాలు, శాస్త్ర చికిత్సల వివరాలను అడిగి వాటి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ ఏ.రాజేంద్రనాథ్, సుధాకర్, వైద్యులు పాల్గొన్నారు.

ఎఫ్‌టీఎల్ హద్దులు సూచించిన హైడ్రా

శంషాబాద్: పట్టణంలోని కొత్వాల్‌గూడ హిమాయత్‌సాగర్ సమీపంలో ఉన్న ఆనంద కన్వెన్షన్ వద్ద ఇరిగేషన్, మెట్రోవాటర్‌బోర్డు, మున్సిపాలిటీ, హైడ్రా అధికారులు గత మూడు పర్యాయాలుగా సర్వే చేశారు. తాజాగా శుక్రవారం సంబంధిత అధికారులు కన్వెన్షన్ కిచెన్ షెడ్ సమీపంలో ఉన్న ఎఫ్‌టీఎల్ భాగానికి హద్దులు సూచించారు. దీంతో యాజమాన్యం స్వయంగా అధికారులు సూచించిన మేరకు ఉన్న నిర్మాణాన్ని స్వచ్ఛందంగా తొలగించారు. పట్టణంలోని హిమాయత్‌సాగర్‌కు సమీపంలో ఉన్న మిగతా కట్టడాలేవి కూడా ఎఫ్‌టీఎల్ పరిధిలో లేనట్లు హైడ్రా సర్వేలో తేలినట్లు సమాచారం. అయితే ప్రస్తుతం బఫర్‌జోన్‌లలో ఉన్నకట్టడాల తొలగింపుపై మాత్రం హైడ్రా ఇంకా చట్టపరమైన చర్యలను తీసుకోవడం లేదు. ఆనంద కన్వెన్షన్ సమీపంలోనే రాజకీయ నేత బంధువుకు సంబంధించిన నిర్మాణం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందా? లేదా? అన్నదానిపై కూడా పూర్తి స్థాయి సర్వే చేపట్టి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

బీఆర్‌ఎస్ బలోపేతానికి ప్రణాళికలు సిద్ధం



మాట్లాడుతున్న అప్పారెడ్డి ముఖేష్

అత్తాపూర్: హైదర్‌గూడ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షులు అప్పారెడ్డి ముఖేష్ మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతం చేసేందుకు కృషిచేస్తానన్నారు. గత పార్లమెంట్ అసెంబ్లీ ఎన్నికల్లో కొంతమంది స్వార్థపరులు బీజేపీ పార్టీ కాంగ్రెస్ పార్టీ జెండాలు వేసుకుని ప్రచారం చేసిన సందర్భాన్ని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమం ఆరంభం నాటి నుంచి నేటి వరకు బీఆర్‌ఎస్ పార్టీ సూచనల మేరకు పనిచేస్తూ రాష్ట్ర స్థాయికి ఎదిగిన విషయాన్ని ఈ సందర్భంగా ముఖేష్ గుర్తు చేశారు. ఉద్యమ రథసారధి మాజీ సీఎం కేసీఆర్, యువ నాయకులు మాజీ మంత్రి తారకరామారావు నేతృత్వంలో స్థానిక సంస్థల్లో బీఆర్‌ఎస్వీ పార్టీ అభ్యర్థులను మెజార్టీ సంఖ్యలో గెలిపించుకుని తమ సత్తా చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అనిల్, వినోద్, స్వరూప్, దినేష్, కృపాకర్ మహేందర్ రెడ్డి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్స్ స్కూల్ టీచర్లకు ఉత్తమ అవార్డులు



అవార్డు పొందిన టీచర్లను అభినందించిన ప్రిన్సిపాల్ శిల్పారెడ్డి

మణికొండ: అరిస్టియా ఇన్‌స్పైరింగ్ టీచర్ అవార్డు–2024ను మణికొండ మున్సిపాలిటీ, అలకాపూర్ టౌన్‌షిప్‌లోని స్కాలర్స్ ఇంటర్నేషనల్ స్కూల్ ఉపాధ్యాయినీలు బుడితి కీర్తి సుమన్, నూరి పల్లవిలు దక్కించుకున్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్‌లో ఉన్న సీబీఎస్ఈ స్కూల్స్ నుంచి వీరు ఎన్నికయ్యారు, బాచుపల్లిలోని క్రీక్ ప్లానెట్ స్కూల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో శుక్రవారం ప్రపంచంలోనే అతి చిన్న ప్రిన్సిపాల్‌గా బీబీసీ గుర్తించిన బాబర్ ఆలీ చేతుల మీదుగా వారు అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా స్కాలర్స్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శిల్పారెడ్డిలు మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును రూపొందించటంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, అలాంటి కీలక బాధ్యతల్లో రాణించటాన్ని సదరు సంస్థ గుర్తించి అవార్డు ఇవ్వటం ఎంతో ఆనందం కలిగించిందన్నారు. తోటి ఉపాధ్యాయులు వారిని ప్రశంసించారు.

ముగిసిన 'మేధోమధనం'



చర్చాగోష్ఠిలో మాట్లాడుతున్న తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ శాస్త్రవేత్తలు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్లాంట్ ప్రొటెక్షన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యవసాయం పురుగుమందుల వాడకం, జీవ సంబంధిత పురుగు మందుల అవశ్యకతపై జరిగిన 'మేధోమధనం సదస్సు' శుక్రవారంతో ముగిసింది. ఇందులో పలువురు ప్రధాన శాస్త్రవేత్తలు పాల్గొన్ని వ్యవసాయంలో మందులను ఎక్కువగా వాడడం వల్ల పురుగులు శిలీంద్రాలు రోగ నిరోధక శక్తి పెంచుకొని రైతులకు సాగు ఖర్చును పెంచుతున్నాయన్నారు. వ్యవసాయంలో ప్రస్తుతం చాలా మంది రైతులు డ్రోన్ వాడకం వాడుతున్నారని, డ్రోన్స్‌తో కలుపు మందులు పిచికారీకి రాబోయే రోజుల్లో పరిశోధనలు చేయడానికి భారత ప్రభుత్వం నుంచి ఇంకా అనుమతి రావల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో డ్రోన్స్ వాడడం పై రైతులకు, యువతకు వారం రోజుల పాటు శిక్షణ ఇస్తుందన్నారు. వ్యవసాయంలో నకిలీ పురుగు మందులు వాడకం పై చర్చాగోష్ఠి నిర్వహించారు. ఇందులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రైతులు పాల్గొన్ని సుదీర్ఘంగా చర్చించారు. ఈ నకిలీ మందులను అరికట్టాలంటే రైతులు అందరూ తప్పకుండా జీఎస్‌టీబిల్ తీసుకోవాలని, రెగ్యులర్ విజిలెన్స్ క్యూఆర్ కోడ్ ముంద్రించడం వ్యవసాయ అధికారులు, రైతులకు తప్పకుండా అవగాహన కలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ గురురాజు, డాక్టర్ నరేంద్రరెడ్డి, రైతులు, విశ్వవిద్యాలయం ప్రతినిధులు పాల్గొన్నారు.

తల్లిపేరుతో ఒక మొక్క నాటాలి



కళాశాలలో మొక్కలు నాటిన చైర్‌పర్సన్, కమిషనర్లు

మణికొండ: 'స్వచ్ఛత హి' సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వట్టినాగులపల్లిలోని శ్రీదేవి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థినులతో కలసి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్, కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి మొక్కలు నాటడంతో పాటు ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటుతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తల్లి పేరుతో ఓ మొక్కను నాటి సంరక్షించాలని, పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున విద్యార్థినులు, శానిటరీ ఇంచార్జి లచ్చిరాం, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న చైర్‌పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్

పార్కులో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న కమిషనర్, వైస్ చైర్మన్లు



స్వచ్ఛతను పెంపొందించాలి

మణికొండ: 'స్వచ్ఛత హి' సేవ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి 3వ వార్డు పంచవటి కాలినీలో దాశరధి కృష్ణమాచార్య పార్కులో పరిసర ప్రాంతాల్లో చెత్తను క్లీన్ చేయించి కాలనీ వాసులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం బుల్కాపూర్ నాలా వెంట ఉన్న వాకింగ్ ట్రాక్‌లో పిచ్చి మొక్కలను తొలగించారు. కాలనీలో 'ఫ్రైడే–డ్రైడే' కార్యక్రమంలో విషజ్వరాలు, డెంగ్యూ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనంతరం 8వ వార్డు అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 15లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తను, పిచ్చి మొక్కలను తొలగింప చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ సంజయ్, కౌన్సిలర్ నవీన్‌కుమార్, శానిటేషన్ ఇంచార్జి సంపత్, సిబ్బంది పాల్గొన్నారు.



కాలనీ వాసులతో ప్రతిజ్ఞ చేయించిన అధికారులు